క్లుప్తంగా

పెంట విద్యార్థి ప్రతిభ



ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న సుధీర్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామానికి చెందిన మీసాల సుధీర్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ఆదివారం పట్టా పొందారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో 10వ ర్యాంకు సాధించి పట్టా అందుకున్నారు. గ్రామంలో తొలిసారి ఎంబీబీఎస్ పట్టా అందుకున్న వ్యక్తిగా గుర్తింపు పొందిన సుధీర్‌కుమార్‌ను తల్లిదండ్రులు మీసాల రమణ, గ్రామస్తులు అభినందించారు.

19 నుంచి అజ్జరాంలో ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం గ్రామంలో ఈ నెల 19 నుంచి ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమారామ లింగేశ్వర పంచాయతన సహిత దేవాలయలం, ఉమారామలింగేశ్వర మృత్యుంజయ జ్ఞానలింగ ఆలయ నిర్మాణాలకు సంబంధించి మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రతిష్టాపన పూజలు జరుగుతాయని, చివరి రోజు 21న అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పిక్కాట నిర్వాహకులపై కేసు నమోదు

గార : వత్సవలస రాజులమ్మ తల్లి జాతరలో శనివారం అర్ధరాత్రి పిక్కాట నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకే స్థలంలో ఆట నిర్వహిస్తున్న ఐదుగురి వద్ద నుంచి రూ.2300, పిక్కాట ఆడిస్తున్న ఇద్దరి నుంచి రూ.1500 వసూలు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

నేడు నూకాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని దేశల్లవీధి వద్ద నూకాలమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు నక్కవీధి, దేశల్లవీధి, కుందనం వీధి ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అలంకరణ, కుంకుమ పూజలు జరుగుతాయని, సంగీత కచేరి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

బీజేపీలో చేరిక



టీడీపీ నుంచి బీజేపీలో చేరిన మైలపిల్లి లక్ష్మీజనార్దన్

గార: మండలంలోని కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)కు చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ సానుభూతిపరులు మైలపిల్లి లక్ష్మీ జనార్దన్ ఆదివారం బీజేపీలో చేరారు. మాజీ సర్పంచ్ స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో సానుభూతిపరులతో కలిసి పార్టీలో చేరారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు వారికి పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. మాజీ సర్పంచ్‌తో పాటు పాటు లక్ష్మీరాజ్యం, శారద, పుణ్యవతి తదితరులున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడి వేణుగోపాలం, చల్లా వెంకటేశ్వరరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి యోగీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు గ్లాస్ అండ్ వాటర్, గ్లాస్ అండ్ స్ట్రా వంటి ఆటల పోటీలు నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనగా.. విజేతలకు లైన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, సాయిప్రసాద్, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తినాయుడు కోరారు. ఆదివారం నడిమివలస, జి.సిగడాం, ఆనందపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వజ్జిపర్తి రఘురాం, మీసాల రామకృష్ణ, పలిశెట్టి సత్యారావు తదితరులు పాల్గొన్నారు

ఆ ఒక్కటీ అడగొద్దు!

- రాగోలు అర్బన్ లేఅవుట్ కాలనీ (జగనన్న కాలనీ)లో నిలిచిన రేషన్ సరఫరా
- మూడు నెలలుగా సరుకులు అందక లబ్ధిదారుల పాట్లు
- పట్టించుకోని అధికారులు, కూటమి నేతలు



రాగోలులోని అర్బన్ లే అవుట్ జగనన్న కాలనీ (ఎన్‌టీఆర్ నగర్)

శ్రీకాకుళం రూరల్ :

మండల పరిధిలోని వాకలవసల రాగోలు అర్బన్ లేఅవుట్ జగనన్న కాలనీ (ఎన్‌టీఆర్ నగర్)లో రేషన్ సరుకులు అందక లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న సుమారు 60 కుటుంబాలకు మూడు నెలలుగా సరుకులు సరఫరా చేయకపోవడంతో పేదలు ఆకలితో అలమటిస్తున్నారు. కూటమి



రేషన్ అందడం లేదని చెబుతున్న కుటుంబాలు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నాలుగు నెలలు మాత్రమే ఇంటింటికి వచ్చి రేషన్ సరుకులు అందించారు. డిసెంబర్ నుంచి సరుకులు సరఫరా చేయడం లేదని, ఎప్పుడు అడుగుతున్నా ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని మౌలిక వసతులు..

కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీరు, డ్రైనేజీ సమస్యతో పాటు సరైన రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కాలనీ వైపు చూసిన దాఖలాలు లేవని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రేషన్ సరుకులు సరఫరా చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ ఇవ్వడం లేదు



ప్రభుత్వం సరఫరా చేసే రేషన్‌పైనే మేమంతా ఆధారపడుతున్నాం. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల రేషన్ ఇవ్వలేదు. మా పక్కనే వాకలవలస వెళ్లి రేషన్ కోసం అడిగినా మీ కార్డులకు రేషన్ రాలేదంటూ మాట దాటవేస్తున్నారు. దీంతో పస్తులుండాల్సి వస్తోంది.

– పేరాడ ఆండాలమ్మ, జగనన్న అర్బన్ కాలనీ

అన్నీ సమస్యలే



జగనన్న అర్బన్ కాలనీ (ఎన్‌టీఆర్ నగర్)లో అన్ని సమస్యలే. తాగడానికి మంచినీరు దొరకడం లేదు. ఈగలు, దోమలు, పిచ్చిమొక్కలు మధ్యే జీవిస్తున్నాం. సరైన రోడ్లు కాలువలు లేక అవస్థలు పడుతున్నాం. పాలకులు పట్టించుకోవడం మానేశారు.

– సంజాక్త నాయక్, జగనన్న అర్బన్ కాలనీ

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తాం



మా సమస్యలపై కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తాం. జగనన్న లేఅవుట్‌లో ఇల్లు కట్టుకొని స్థిర నివాసముంటున్న మమ్మల్ని పట్టించుకోకపోతే ఎలా? రేషన్ కార్డు ద్వారా రేషన్ ఇవ్వకపోతే ఎలా బతకాలి. అధికారులు గానీ, నాయకులు గానీ పట్టించుకోవడం లేదు.

– బొచ్చు లక్ష్మి, జగనన్న అర్బన్ కాలనీ

సమస్య పరిష్కరిస్తాం

రాగోలు అర్బన్ లేవుట్‌లో కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తాం. అక్కడి వారికి రేషన్ సరుకులు వెళ్లడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. రేషన్ అందేలా చర్యలు తీసుకుంటాం. మిగతా సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం.

– గణపతి, శ్రీకాకుళం రూరల్ తహసీల్దార్

సత్ప్రవర్తనతో మెలగాలి



పులఖండం శ్రీనివాసరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, నాటి పురాణాలలోని అంశాలే నేటి తరానికీ వర్తిస్తాయని పులఖండం శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో 'సర్వశక్తి సమన్వత' అనే అంశంపై ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి-చెడు, హింస-అహింస, సత్ప్రవర్తన-దుష్ప్రవర్తన వంటివాటిలో ఎన్ని తరాలు గడిచినా మార్పురాదని వివరించారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభాకరరావు, మందుల మోహనరావు, పి.పతంజలి శాస్త్రి, విశ్వేశ్వరరావు, కామేశ్వరరావు, సనపల నారాయణమూర్తి, కె.బాబూరావు, రంగడు ప్రసాదరావు, ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, ఉమారాణి, లక్ష్మీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన రామజోగినాయుడు

శ్రీకాకుళం: అట్టడుగు వర్గాల నిరుద్యోగులను ఆదుకునేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలని జిల్లా తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.రామజోగినాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో తూర్పుకాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ, కానిస్టేబుల్ ఇతర కాంపిటేటివ్ అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి, మెటీరియల్ ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.నారాయణరావు, పి.తమ్మినాయుడు, పి.సురేష్, ఎ.తవిటన్న, వి.శ్రీరాములు, డి.మోహన్‌రావు, ఎల్.సుందరావు తదితరులు పాల్గొన్నారు.

శివారాధనతో మోక్షం



శివరాత్రి విశేషాలను వివరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని లక్ష్మీ థియేటర్ పరిసర ప్రాంతంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ఆదివారం త్రైతసిద్ధాంతం-ప్రబోధసేవా సమితి హిందూ జ్ఞాన విజ్ఞానవేదిక జిల్లా శాఖ సభ్యులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. శివరాత్రి ప్రత్యేకత, అనుబంధ గ్రంథాల ఆవశ్యకతను వివరించారు. శివలింగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు ప్రతిరూపమని, ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని చెప్పారు. శివరాత్రిని మోక్షరాత్రి అని అంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు సంతోష్‌కుమార్, దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ, అప్పన్న, వాసుదేవరావు, లక్ష్మీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

స్తంభాన్ని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బస్సు ఇదే

శ్రీకాకుళం రూరల్: రాగోలు జంక్షన్ వద్ద ఆదివారం పాతపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి ఎడమవైపు కరెంట్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కానప్పటికీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సందీప్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు భద్రత ప్రమాణాలు వాహన చోదకులు పాటించాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ అన్నారు. చిలకపాలెంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ఆదివారం స్థానికులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రాంగ్ రూట్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం నేరమన్నారు. అజ్ఞాత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి నగరానికి చెందిన లోకనాథం అన్నపూర్ణమ్మ తన భర్త గుంపస్వామి జ్ఞాపకార్థం రూ.10వేలు విరాళం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు, లోకనాథం రామారావు, వల్లూరి సాయిశరత్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి అభిషేకాలు



అభిషేకాలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరంలోని బాలా త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాల భైరవ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్యాన్నదానం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దత్తక్షేత్రంలో ప్రసాద వితరణ



దత్తభిక్ష ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని 'చిం' దత్తక్షేత్రంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం దత్త భిక్ష ప్రసాద వితరణ జరిగింది. ఆలయ అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో ముందుగా గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గవర గోవిందరావు, సభ్యులు, జయలక్ష్మీ మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతికి పంచామృతాభిషేకాలు



లక్ష్మీగణపతికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీగణపతి ఆలయంలో ఆదివారం సంకష్టహర చతుర్థి సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. షిరిడీసాయి సేవా సంఘం, అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ గణపతి హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మురుగునీరు కాదు తాగునీరే



శ్రీకూర్మం జెడ్పీ హైస్కూల్ జంక్షన్ నుంచి దువ్వుపేట సచివాలయానికి వెళ్లే సీసీ రోడ్డులో తాగునీరు వృథాగా పోతోంది. నిత్యం ఇదే పరిస్థితి ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి వృథాను అరికట్టి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

– గార

సంబరం..సంప్రదాయం



గారువానిపేటలో ఆదివారం రాజరాజేశ్వరి సంబరం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి పుట్ట వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్లకోసారి జరిగే ఈ వేడుకల్లో పూసర్లపాడు, టిక్కలికి చెందిన కుటుంబ ఆడపిల్లలతో పాటు శిర్ల కుటుంబ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారని దాసుడు వేషధారి యర్రన్న తెలిపారు.

– గార

కట్టెసాగు.. భూమికి బాగు



కట్టిజనుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- అనేక పోషకాలు అందిస్తున్న కట్టిజనుము పంట
- తక్కువ పెట్టుబడి.. అధిక రాబడి
- ఆసక్తి చూపుతున్న రైతులు



కట్టి జనుము గింజలు

జి.సిగడాం: రైతులు పంట భూముల్లో అధిక దిగుబడుల సాధనకు రసాయన ఎరువులను అధికంగా వాడకంతో భూమిలో విలువైన పోషకాలు అంతరించిపోతున్నాయి. ఫలితంగా భూమి సారవంతం కోల్పోతోంది. ఏ పంట వేసినా దిగుబడులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో రసాయనిక ఎరువులు అందుబాటులో ఉండటంతో ఇష్టానుసారంగా వాడేస్తున్నారు. వీటిని అధిగమించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతు సేవా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లు పచ్చిరొట్ట ఎరువులు(కట్టి జనుము) వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

సాగు ఇలా...

రైతు వరి సాగు అనంతరం పంటపొలాల్లో అపరాలు బదులుగా కట్టిజనుము సాగు చేసుకుంటే భూసారంతోపాటు అధిక రాబడులు సాధించే అవకాశముంటుంది. ఎకరా పొలంలో 10 కేజీల విత్తనాలు వేసుకోవాలి. వీటిని ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు అందిస్తోంది. పంట వేసిన 30 -35 రోజుల వ్యవధిలో 13-0-45 (మల్టీకే) ఎకరాకు కేజీ చొప్పున పిచికారి చేసుకోవడం ద్వారా నాణ్యమైన గింజ దిగుబడి సాధించవచ్చు. కట్టిజనుము సాగు చేసుకుంటే రైతుకు ఎటువంటి కష్టం ఉండదు. ఎకరాకు 6-7 క్వింటాళ్ల జనుములు దిగుబడులు వస్తుంది. క్వింటా ధర సుమారు 7 వేల రూపాయల వరకు మార్కెట్‌లో ఉంది. దీంతోపాటు భూసారం కూడా మెరుగ్గా ఉంటుంది.

16 రకాల పోషకాలు..

కట్టి జనుము సాగు చేయడంతో భూమికి 16 రకాల పోషకాలు అందుతాయి. నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, ఐరన్, సల్ఫర్, జింక్, కాపర్, బోరాన్, మాలిబ్డినం, నికెల్, కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, క్లోరిన్, మాంగనీస్‌లతోపాటు ఇతర పోషకాలు భూమికి లభ్యమవుతాయి.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు రసాయనిక ఎరువులు వాడటంతో భూమిలో ఉన్న పోషకాలు అంతరించిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి రైతు సేంద్రియ ఎరువులు వాడేలా అవగాహన కల్పిస్తున్నాం.

– కుమరాపు సుగణకరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్, నడిమివలస

సూచనలిస్తున్నాం..



రైతులు అధిక దిగుబడుల కోసం రసాయనిక ఎరువులు వాడకం తగ్గించుకోవాలి. ఇప్పటికే మండల వ్యాప్తంగా 120 ఎకరాల్లో కట్టిజనుమను రైతులు సాగు చేస్తున్నారు. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నాం.

– యర్రా శారద, వ్యవసాయాధికారి, జి.సిగడాం

రాజమ్మా.. కరుణించమ్మా..



హాజరైన భక్తులు



సముద్ర స్నానాల్లో భక్తులు

గార: చినవత్సవలస రాజరాజేశ్వరి తల్లి రెండోవారం యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రి పూజలు, జాగరణ చేసిన వాళ్లంతా ఆదివారం ఉదయం సముద్రంలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం రాజమ్మ తల్లి సంబరంలో పాల్గొని మొక్కులు చెల్లించారు. గతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం శ్రీకూర్మం కూడలి నుంచి తూలుగు పంచాయతీ మీదుగా వత్సవలస వెళ్లి తిరిగి సీఎస్పీ రోడ్డుకు చేరుకునేవారు. ఈ వారం ద్విచక్ర వాహనాలు, కార్లను యాళ్లపేట మీదుగా శ్రీకూర్మం వెళ్లి వత్సవలస చేరుకునేలా చేయడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడలేదు.

పాత పెన్షన్ అమలుచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ 2003 నవంబర్‌లో వెలువడితే.. ఉద్యోగాలను 2005 నవంబర్‌లో భర్తీచేసి జాప్యం చేసింది అప్పటి ప్రభుత్వమేనన్నారు.